పరీక్షా కేంద్రాల తనిఖీ

జన్నారం, మార్చి 19 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, లిటిల్ హన్స్ హైస్కూళ్లలోని పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

నూతన కార్యవర్గం

హాజీపూర్, మార్చి 19 : మండలంలోని గడ్‌పూర్ మత్స్య ప్రాథమిక పారిశ్రామిక సహకార సంఘం గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మత్స్య శాఖ కార్యాలయ జూనియర్ ఇన్‌స్పెక్టర్ నితిన్ కుమార్ ఎన్నికల అధికారిగా వ్యహరించారు. అధ్యక్షుడిగా గునిగంటి భూమయ్య, ఉపాధ్యక్షుడిగా మనుబోతుల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా మంగూరపు శ్రీనివాస్, సభ్యులుగా ఏదుల భూమయ్య, మంగురపు కిష్టయ్య, తిరునవేణి అశోక్, గునిగంటి తిర్సయ్య, సార మల్లేశ్, దోసందుల తిరుపతిని ఎన్నుకున్నారు.

పంటల సాగుపై అవగాహన

చెన్నూర్ రూరల్, మార్చి 19 : చెన్నూర్ మండలం కిష్టంపేట రైతు వేదికలో శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు రకాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ సాగులో ఉన్న సందేహాలను తెలుసుకున్నారు. అనంతరం కొమ్మెరలో ఏఈవో సాగర్, అంగ్రాజ్‌పల్లిలో ఏఈవో వనదేవి, అక్కెపల్లి, శివలింగాపూర్ గ్రామాల్లో ఏఈవో రాజశేఖర్ పంటలను పరిశీలించారు. రైతు వేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు.

ఒకరిపై దాడి.. తీవ్రగాయాలు

జన్నారం, మార్చి 19 : మండలంలోని పొనకల్ గాంధీనగర్‌కు చెందిన మారాజు అంజన్నపై కాంబ్లే రాజు, అతడి కొడుకు బంకర్ దత్తుతో పాటుగా మరికొందరు దాడిచేశారని, దీంతో తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ మృత్యుంజయ్ సర్కార్ తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అంజన్నను దవాఖానకు తరలించిట్లు చెప్పారు.

మంచిర్యాల పట్టణంలో నేడు నీటి సరఫరా బంద్

మంచిర్యాలటౌన్, మార్చి 19 : పట్టణంలోని తాగునీటి పైపులైన్ల సాధారణ మరమ్మతుల్లో భాగంగా బుధవారం పట్టణంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ తెలిపారు. 36 వార్డుల్లో తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ-ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాసిపేట, మార్చి 19 : కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్మాత్మక పోలింగ్ కేంద్రాలను దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులతో కలిసి బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పరిశీలించారు. మల్కేపల్లి, గట్రావ్‌పల్లి, ధర్మారావుపేట, వెంకటాపూర్, సోనాపూర్, దేవాపూర్‌లోని పోలింగ్ కేంద్రాల్లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏసీపీ సందర్శించారు.

కాసిపేట : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రవి కుమార్, ఎస్ఐ ఆంజనేయులు

వసతులు కల్పించాలి : హాజీపూర్ డీటీ

హాజీపూర్, మార్చి 19 : మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని మండల సెక్టోరల్ అధికారులకు డిప్యూటీ తహసీల్దార్ హరిత సూచించారు. తహసీల్ కార్యాలయంలో మంగళవారం వారితో సమావేశం నిర్వహించారు. మండలంలోని 32 పోలింగ్ బూత్‌లను పరిశీలించి, మౌలిక వసతులను పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్, ఏపీవో శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్ఐ చాంద్ పాషా, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లహరి, ఆర్ఐలు ప్రభు, మంగ, మిషన్ భగీరథ ఏఈ, ఏఈవో సైండ్ల కనుక రాజు తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో..

వేమనపల్లి, మార్చి 19 : నీల్వాయి, మామడ, కేతనపల్లి, ముల్కలపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమేశ్ పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల కోసం తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్ఐ లక్ష్మణ్ ఉన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై సమావేశం..

సీసీసీ నస్పూర్, మార్చి 19 : లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)పై నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కమిషనర్ చిట్యాల సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్, సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్ హాజరై, ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చించారు. ఎన్నికల మోడల్ కోడ్ ఉల్లంఘించరాదని, పట్టణంలో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఎన్నికల కోడ్‌పై పట్టణ ప్రజలు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

హాజీపూర్ : మండల సెక్టోరల్ అధికారులతో మాట్లాడుతున్న డీటీ హరిత

వేమనపల్లి : నీల్వాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేశ్

సీసీసీ నస్పూర్ : ఎన్నికల కోడ్‌పై చర్చిస్తున్న మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

కాసిపేట, మార్చి 19 : గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక సూచించారు. పోషన్ పక్వాడలో భాగంగా మండలంలోని లంబాడీతండా అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, 6 నెలలు నిండిన పిల్లలకు అదనపు ఆహారం తినిపించాలని సూచించారు. 3 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందించడం జరుగుతుందన్నారు. చిరు ధాన్యాలు, తల్లిపాత్ర ప్రాముఖ్యత, అదనపు ఆహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, తల్లులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

మాదారం, తాండూర్‌లో అన్నప్రాసన..

తాండూర్, మార్చి 19 : పోషణ పక్వాడ్‌లో భాగంగా మాదారం, తాండూర్ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. మాదారం త్రీ ఇంక్లైన్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, పోషక ప్రయోజనాలపై తల్లులు, సంరక్షకులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు సూపర్‌వైజర్ మమత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం 23వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎనగంటి సువర్ణ, తిరుమలేశ్వరి, లక్ష్మి, ఆయాలు, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక

దాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో..

కన్నెపల్లి, మార్చి 19 : దాంపూర్ అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి సూపర్‌వైజర్ ఇందిరా వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరోజ, సునిత, ఆయా, ఆశ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

తాండూర్: మాదారం త్రీ ఇంక్లైన్ కేంద్రంలో అన్నప్రాసన..

కన్నెపల్లి : గర్భిణులకు సీమంతం..

పన్నుల చెల్లింపులో వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోవాలి

షాపు యజమానికి పన్ను బిల్లు అందజేస్తున్న కమిషనర్ సతీశ్

- నస్పూర్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్
- ముమ్మరంగా పన్నుల వసూళ్లు

సీసీసీ నస్పూర్, మార్చి 19 : ఆస్తి పన్నుపై ప్రభుత్వం కల్పిస్తున్న 90 శాతం వడ్డీ మాఫీని నస్పూర్ పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ చిట్యాల సతీశ్ సూచించారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లు ముమ్మరంగా కొనసాగున్నాయి. మంగళవారం మున్సిపల్ కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి, వసూళ్ల తీరును పరిశీలించారు. 2022-23కు సంబంధించిన ఆస్తి పన్నును 10 శాతం వడ్డీతో కలిపి చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సతీశ్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి..

చెన్నూర్, మార్చి 19 : 2023-24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున చెన్నూర్ మున్సిపాలిటీలో ఇంటి, నీటి, వాణిజ్య పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులను 31వ తేదీలోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ జీ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయి పడ్డ ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ ఉంటుందని పేర్కొన్నారు. ఇంతకు ముందే చెల్లించిన వారికి 90 శాతం వడ్డీ మాఫీ డబ్బును అడ్వాన్స్ రూపంలో రానున్న ఆర్థిక సంవత్సరానికి అడ్జస్ట్ చేయనున్నట్లు వెల్లడించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

హాజీపూర్, మార్చి 19 : మండలంలో పాడి పశువులకు యజమానులు గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని హాజీపూర్ పశు వైద్యురాలు శాంతి రేఖ సూచించారు. మండల కేంద్రంలో 330 జీవాలకు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యురాలు మాట్లాడుతూ.. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలంలో జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్క రైతూ టీకాలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ అగ్నివేశ్, నారాయణ, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో జాజిరి సందడి

తాండూర్, మార్చి 19 : కాముని పున్నమి నేపథ్యంలో 9 రోజుల పాటు జాజిరి ఆడటం తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో.., వీధుల్లో.., ఇంటింటా.., దుకాణాల సమూదాయాల్లో చిన్నారులు, యువకులు జాజిరి ఆడుతున్నారు. ఆడపడుచులు, దుకాణాల యజమానులు తమకు తోచిన కానుకలు ఇచ్చి పంపిస్తున్నారు. 9 రాత్రులు జాజిరి ఆడి, చివరి రోజు కామదహనం చేస్తారు.

తాండూర్‌లో జాజిరి ఆడుతున్న చిన్నారులు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

హాజీపూర్, మార్చి 19 : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గ్రాయాలైనట్లు ఏఎస్ఐ ఎస్‌కే చాంద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న టాటా ఏస్ ట్రాలీ.. లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న టాటా ఏస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఇదే క్రమంలో లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న మరో టాటా ఏస్, దాని వెనకాలే వస్తున్న ఆటో ఒకదాని వెనుక ఒకటి ఢీ కొట్టుకోవడంతో అందులోని ప్రయాణికులు గాయపడ్డారు. కోటపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ముళ్ల శేఖర్ కుటుంబ సభ్యులతో పాటు వేమనపల్లి మండలానికి చెందిన మరో టాటా ఏస్‌లో మూడు కుటుంబాలకు చెందిన 16 మంది కొండగట్టు దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం చోటు చేసుకున్నది. టాటా ఇంట్రా వాహనం డ్రైవర్ బాకం రవి కాలు, భుజానికి బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయాలైన వారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ప్రమాదంలో గాయపడిన మహిళలు

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

మందమర్రి, మార్చి 19 : సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే అది సాధ్యమవుతుందని ఎన్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. వయోజన విద్యా శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి ఆధ్వర్యంలో శ్రీపతినగర కాలనీలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రం, వయోజన విద్యా కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఎంతో శక్తివంతులని, సమాజ గమనాన్ని మార్చే శక్తి వారికి మాత్రమే ఉంటుందన్నారు. ఉచిత శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. సులభ పద్ధతిలో వారికి చదువు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ కొండపల్లి అశోక్‌రావు, శిక్షణ కేంద్రం కో-ఆర్డినేటర్ గోపిక, ట్రైనర్ శారద, నరేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్

అక్రమ నిర్మాణాల తొలగింపు

బెల్లంపల్లి, మార్చి 19 : మున్సిపాలిటీ పరిధిలోని బజార్ ఏరియాలో దుకాణాల ఎదుట ఉన్న అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఆధ్వర్యంలో తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. పోలీసుల సహకారంతో కాంటా చౌరస్తా నుంచి బజార్ ఏరియా వరకు పార్కింగ్ స్థలాన్ని ఆక్రమించి, చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను తొలగించారు. మురుగుకాలువను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను సైతం ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కాలువలను ఆక్రమించి, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. పార్కింగ్ స్థలం లేకపోవడం, ఈ ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో పోలీసులు జరిమానా విధిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం సంజీవరెడ్డి

గడువుకు ముందే లక్ష్యం పూర్తి

- ఆర్కే-5 గనిలో వరుసగా మూడోసారీ ఉత్పత్తి సాధన
- అభినందించిన శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 19 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-5 గని 11 రోజుల ముందే వార్షిక లక్ష్యాన్ని సాధించింది. గని డీవైజీఎం అబ్దుల్ ఖాధర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు, కార్మికులు, అధికారులు సంబురాలు చేసుకున్నారు. జీఎం సంజీవరెడ్డి, డీవైజీఎం ఏవీ రెడ్డి పాల్గొని, కార్మికులను అభినందించారు. 2023-24కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 2.70 లక్షల టన్నులను మంగళవారం నాటికి పూర్తిచేసిందన్నారు. వరుసగా మూడో ఏడాదీ 100 శాతం ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ, మహేందర్ రెడ్డి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి నర్సింగా రావు, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్, ఐ కుమారస్వామి పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ తరగతులు

వైద్యులు, సిబ్బందికి శిక్షణనిస్తున్న ఈఎంఆర్ఐ జీవీకే వైద్యులు

రామకృష్ణాపూర్, మార్చి 19 : రామకృష్ణాపూర్ సింగరేణి దవాఖానలో వైద్యులు, వైద్య సిబ్బందికి బీఎల్ఎస్ (బేసిక్ లైఫ్ సపోర్ట్), ఏసీఎల్ఎస్ (యాక్యూట్ కరోనరీ సిండ్రోమ్ అరెస్ట్ రిథమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ ట్రూమా లైఫ్ సపోర్ట్) అంశంపై ఈఎంఆర్ఐ జీవీకే ఫౌండేషన్ వైద్యులతో నాలుగు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు అదనపు సీఎంవో డాక్టర్ ఉష తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులు 22వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బెల్లంపల్లి రీజియన్ (శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, ఎస్టీపీపీ) వైద్యులు, స్టాఫ్ నర్స్, వార్డ్ బాయ్స్‌కు శిక్షణ ఉంటుందన్నారు. అత్యవసర సమయాల్లో రోగికి అందించాల్సిన వైద్యం గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా జయవాణి, డా ప్రసన్న, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, ఆంజనేయులు, పిట్ నాగేంద్ర బట్, ఈఎంఆర్ఐ జీవీకే వైద్యులు జీవేద్, రవి, సంక్షేమ అధికారి జీదుల శ్రీనివాస్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

ఈఅండ్ఎం ఈఈ సస్పెన్షన్ వెంటనే రద్దు చేయాలి

శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అధికారుల సంఘం నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 19 : మందమర్రి ఏరియా ఈఅండ్ఎం ఈఈ శశిధర్‌పై యాజమాన్యం విధించిన సస్పెన్స్‌ను రద్దు చేయాలని సింగరేణి అధికారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీరాంపూర్ ఏరియా సీఎంవోఏఐ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్ జీఎంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మందమర్రి ఏరియా స్టోర్‌లో జరిగిన ప్రమాదంలో ఈఈ శశిధర్‌పై సస్పెన్స్ చేయడాన్ని వ్యతిరేకించారు. వెంటనే సస్పెన్సన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఎంఎస్ విచారణ పురోగతిలో ఉన్నదని, వాస్తవాలు తెలియనందున వెంటనే సస్పెన్సన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు మహేశ్, కే కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మారుతి

చంద్రశేఖర్

శ్రీరాంపూర్, మార్చి 19 : శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పేరం రమేశ్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా బరుపాటి మారుతి, కార్యదర్శిగా బొడిగె చంద్రశేఖర్‌ను నియమించినట్లు తెలిపారు.

కోర్టు ఆవరణలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

కోర్టును సందర్శించిన విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 19 : క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ విద్యార్థులు మంగళవారం బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. పొలిటికల్ సైన్స్ లెక్చరర్ సమ్మక్క ఆధ్వర్యంలో బీఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థులు జడ్జి ముఖేశ్‌ను కలిసి మాట్లాడారు. కోర్టు నిర్వహణ, న్యాయ సంబంధిత విషయాల గురించి అక్కడి న్యాయవాదులు, సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. వారితో పాటు కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

చెక్కు అందజేత

లక్షెట్టిపేట, మార్చి 19 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన, ఎల్లారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు బీ ఆండాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పీఆర్టీయూటీఎస్ సభ్యురాలు కావడంతో రూ.లక్ష సంక్షేమ నిధి చెక్కు మంజూరైంది. సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్ర పత్రిక సంపాదకులు రాసపల్లి రవి, జిల్లా ప్రధానకార్యదర్శి కొట్టె శంకర్, జిల్లా సమాధ్యక్షుడు పెట్టెం తిరుపతి, రాష్ట్ర బాధ్యులు బోడకుంటి తిరుపతి, మండలాధ్యక్షుడు పింగిళి వేణుగోపాల్, ప్రధానకార్యదర్శి చుంచు లక్ష్మణ్, కుదిరె సత్తయ్య, జిల్లా బాధ్యులు తిరుపతి, రవీంద్రనాయక్, దిగంబర్, నీరజ తదితరులు పాల్గొన్నారు.